**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేదీ : ఆగష్టు 26, 2016.**

**శ్రీయుత ఎన్. సాంబశివరావు గారు,**
డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
విజయవాడ.

**ప్రచురణార్థం:** ఆగష్టు 26 (శుక్రవారం)న సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, మాజీ పార్లమెంటు సభ్యులు డా॥ యం.బాబూరావులు డిజిపి గారిని కలిసి ఇచ్చిన మెమోరాండం కాపీని ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్, ఆఫీస్ కార్యదర్శి**

**గౌరవనీయులైన అయ్యా,**

**విషయం : పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులపై పోలీసుల నిర్బంధం, అక్రమ కేసులు, భూసమస్యల్లో చట్ట విరుద్ధ జోక్యం ఆపాలని కోరుతూ...**

పశ్చిమగోదావరి జిల్లాలో షెడ్యూలు ప్రాంతమైన పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో గిరిజన చట్టాలు తీవ్రంగా ఉల్లంఘించబడ్తున్నాయి. ఈ ప్రాంతంలో గిరిజనుల భూములకు రక్షణ కల్పించే 1/70 చట్టం అలాగే పెసా (షెడ్యూల్ ఏరియా ప్రత్యేక పంచాయితీ చట్టం) చట్టం, పోడు భూములకు హక్కులు కల్పించే అటవీ హక్కుల గుర్తింపు చట్టం తీవ్రంగా ఉల్లంఘించబడ్తున్నాయి. ఈ చట్టాల అమలుకు సహకరిస్తూ, గిరిజనులకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. షెడ్యూలు ప్రాంతానికి చెందిన రాజ్యాంగ ప్రత్యేక హక్కులు, చట్టాలు రాష్ట్ర గవర్నరు పరిధిలో ఉన్న విషయం మీకు తెలుసు. 1/70 చట్ట ప్రకారం 1970 తర్వాత షెడ్యూలు ప్రాంతంలో భూముల అమ్మకాలు, కొనుగోళ్ళు నిషేధించబడ్డాయి. ఇందుకు విరుద్ధంగా అమ్మకాలు సాగితే ప్రభుత్వం అట్టి భూములు స్వాధీనం చేసుకొని 1/70 చట్ట విరుద్ధ భూములు (ఎల్‌టిఆర్ భూములు)గా గుర్తించి గిరిజనులకు పంచాలి. దశాబ్దాలు గడిచినా ఈ భూములు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని పంచకపోవడంతో చివరకు గిరిజనులు కొన్ని భూములు స్వాధీనం చేసుకొని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ఈ వివాదాలు పరిష్కరించవలసింది రెవెన్యూ శాఖ కాగా భూస్వాములు ఫిర్యాదు పేరుతో పోలీస్ వారే చట్ట విరుద్ధంగా భూముల్లోకి ప్రవేశిస్తున్నారు. గిరిజనుల్ని బెదిరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. పలు సందర్భాల్లో గిరిజన నాయకులపై రౌడీషీట్లు పెడ్తామని కూడా హెచ్చరిస్తున్నారు.

మూడు మండలాల్లోని గిరిజనులు సుమారు వెయ్యి మందిపై 500 పైగా కేసులు నమోదు చేసియున్నారు. వీరిలో గిరిజన మహిళలు పెద్ద సంఖ్యలో వున్నారు. చోడెందుర్గ అనే గిరిజన మహిళపై 22 కేసులు పెట్టారు. గత 20 సం॥రాల కాలంలో వందల సంఖ్యలో గిరిజనులను అక్రమంగా అరెస్టు చేసి నెల నుండి 6 నెలల వరకు రిమాండ్ ఖైదీలుగా రాజమండ్రి కేంద్ర కారగారంలో ఉంచారు. గిరిజన నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, ఇంకా కొందరిపై రౌడీ షీట్ పెట్టియున్నారు. వీటిని పరిశీలించి ఎత్తివేస్తామని గతంలో (2006లో) డిజిపి, ఎస్‌పి గార్లు హామీ ఇచ్చి 200 పైగా కేసులు ఎత్తివేసారు. చట్ట విరుద్ధంగా సివిల్ వివాదాలైన భూ సమస్యల్లో పోలీసులు జోక్యం చేసుకుంటూ గిరిజనులను మీ రికార్డులు తీసుకురండి చూసి చెబుతామంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు.

2వ పేజీలో...

ఈ 20 ఏళ్ళ కాలంలో ఫోర్జరీలు చేసినా, గిరిజనులు తమకు జరుగుతున్న అన్యాయాలపై ఎన్ని కేసులు పెట్టినా ఒక్క గిరిజనేతర భూస్వామిపై కూడా కేసు నమోదు చేసి, అరెస్టు చేయలేదు. దీన్ని బట్టి పోలీసు శాఖ వారు గిరిజనుల పట్ల వ్యవహరిస్తున్న తీరు ఎలా వుందో అర్థమవుతుంది.

**కొన్ని కేసులు :**

**(1)** పోలవరం మండలం ఇటికల కోటలో **50** మంది గిరిజనులు **46** ఎకరాలు **20** ఏళ్ళుగా సాగుచేస్తున్నారు. కరిబండి వీర వెంకటసత్యనారాయణ అనే భూస్వామి **2016**లో మొక్కజొన్న పంట దొంగిలించబోయాడు. గిరిజనులు పట్టుకుంటే పోలీసువారు జోక్యం చేసుకొని వివాదం తహసిల్దార్ గారు పరిష్కరిస్తారు. అయ్యే వరకు ట్రాక్టర్‌లోని పంట మా వద్దే ఉంచుతామన్నారు. గిరిజనులు అంగీకరించి సదరు భూస్వామిపై కేసు పెట్టారు. చిత్రమేమిటంటే ఈ కేసు నమోదు కాలేదు. పంట దక్కలేదు. కానీ గిరిజనులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

**(2)** పోలవరం మండలం రెడ్డినాగం పాలెంలో ఎస్‌డిసి కోర్టులో, హైకోర్టులో తీర్పులు గిరిజనులకు అనుకూలంగా వచ్చాయి. అయినా ఆ భూముల్లోకి గిరిజనేతర భూస్వాములు అక్రమంగా ప్రవేశించారు. గిరిజనులపై కేసు పెట్టి ఉభయులు భూమూముల్లోకి వెళ్ళవద్దని పోలవరం పోలీసువారు రెవెన్యూవారితో కలిసి చెప్పారు. కానీ ఇప్పుడు ఆ భూముల్లోకి గిరిజనేతరులు ప్రవేశిస్తున్నారు. ఇక్కడ కూడా చిత్రంగా గిరిజనులపైనే అన్యాయంగా కేసు నమోదు అయ్యింది.

**(3)** బుట్టాయిగూడెం మండలం మర్లగూడెంలో ఇరవై ఏళ్ళుగా గిరిజనులు **26** ఎకరాల్లో సాగులో వున్నారు. **2006**లో నాటి ఆర్డీవో (జంగారెడ్డి గూడెం) రికార్డులు పరిశీలించి, ఎల్‌టిఆర్ గా తేల్చారు. నేడు ఆ భూములపై ప్రస్తుత ఆర్డీవో గిరిజనేతరులకు అనుకూలంగా ఆదేశం ఇచ్చారు. ఇవి గిరిజనేతరుల పట్టా భూములు తప్పుకోకుంటే జైల్లో పెడతామని బెదిరిస్తున్నారు. రెవెన్యూ వారితో కలిసి దగ్గరుండి పోలీసువారు గిరిజనుల ప్రత్తి పంటను అక్రమంగా దున్నేసారు. దీనిపై గిరిజనేతరులపై కేసు పెద్దే నమోదు చేయలేదు.

**(4)** బుట్టాయిగూడెం మండలం ఇనుమూరు, కొవ్వాడ, రెడ్డిగణపవరం, తోటపల్లి, తూర్పు రేగులకుంట, గ్రామాలకు పోలీసువారు వెళ్ళి గిరిజనుల్ని భూసమస్యలపై పదే పదే బెదిరిస్తున్నారు. గిరిజనులైన కోర్యాజలపాలు, వెట్టి వీరయ్యలకు ఫోన్లు చేసి రౌడీషీట్లు పెడ్తామని హెచ్చరిస్తున్నారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి ఎ.రవిని, బుట్టాయిగూడెం మండల కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్‌ను అరెస్టు చేయాలని చూస్తున్నారు.

**(5)** జీలుగుమిల్లి మండలం జగన్నాథ పురంలోని **90** ఎకరాలు మామిడితోట పూర్వ ఎమ్మెల్యే చేరుకువాడ శ్రీరంగనాథరాజు పోలీసువారిని అడ్డం పెట్టుకొని అడ్డంకులు సృష్టిస్తున్నాడు. **2015**లో గిరిజనులకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చి వున్నది. దాన్ని అమలు చేయమని జంగారెడ్డి గూడెం డిఎస్‌పి, జీలుగుమిల్లి ఎస్‌ఐ గార్లను కోరితే పట్టించుకోలేదు. సదరు భూస్వామి కిరాయి మనుషులను తెచ్చి వివాదం సృష్టిస్తే శాంతి భద్రతల పేరుతో గిరిజనులపై కేసులు నమోదు చేసారు. ఇంత వివాదాలకు కారకుడైన భూస్వామిపై కేసు పెద్దే నమోదు చేయలేదు.

**2016**లో సదరు భూస్వామికి అనుకూలంగా భూముల్లోకి పోలీసువారు వచ్చి గిరిజన మహిళలపై లాఠీఛార్జీ చేసారు. గిరిజన మహిళలు గాయపడ్డారు. ప్రశ్నించిన నేరానికి ఎస్‌ఐ, పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి చంపుతామని గిరిజనులను బెదిరించారు.

**(6)** జీలుగుమిల్లి మండలం పి.రాజవరం, దాట్లవారిదూడెం, రమణక్కపేట, సిరివారి గూడెం, కామయ్య పాలెం గ్రామల్లో గిరిజనులపై గిరిజనేత భూస్వాములు పోలీసు స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చారు. గిరిజనుల్ని స్టేషన్‌కు పిలిచి, బెదిరించడం, బలవంతంగా పి.రాజవరం గిరిజనుల సంతకాలు చేయించుకోవడం, ఇకపై భూముల్లోకి వెళ్ళమని చెప్తే ఏంచేయమని లేకుంటే కేసులుపెట్టి, రౌడీషీట్లు పెట్టి సంగతి తేలుస్తామని పై గ్రామాల్లోని గిరిజన మహిళలను సైతం జీలుగుమిల్లు ఎస్‌ఐ బెదిరించారు.

3వ పేజీలో...

**ఇదే మండలం కామయ్య పాలెంలో గిరిజనులు జీడిమామిడితోటలో గిరిజనేతరులు అక్రమంగా ప్రవేశించి గింజలు ఏరుకుపోయారు. దీనిపై గిరిజనులు గిరిజనేతర భూస్వామి దొడ్డాకుల పుల్లారావుపై కేసు పెడ్తే పోలీసువారు ఏమీ పట్టించుకోలేదు.**

**పి.రాజవరం గిరిజనేతర భూస్వామి కాసాని నాగేశ్వరరావుపై (కూచిపూడి రత్తయ్యకు ఇతను బినామీ) కేసు పెడ్తే నమోదు చేయలేదు. కానీ అతడు ఫిర్యాదు చేసినప్పుడల్లా పోలీసువారు గిరిజనులపట్ల అన్యాయంగా వ్యవహరించారు.**

**(7)** **అలాగే నాన్ షెడ్యూలు ప్రాంతమైన టి.నర్సాపురం మండలంలోనూ గిరిజనుల, పేదల పట్ల పోలీసువారు అన్యాయంగా వ్యవహరించారు.**

**టి.నర్సాపురం మండలం రామమ్మగూడెం, కృష్ణాపురంలోని 20 మంది గిరిజనులు బైండోవరు కేసులు పెట్టారు. కృష్ణాపురం మెట్టపై ఇళ్ళువేసుకున్నందుకు ఇప్పటికీ 4 కేసులు నమోదు చేశారు. రామమ్మగూడెంలో భూస్వాములు కిరాయి గూండాలతో స్వైర వ్యవహారం చేసినా పట్టించుకోలేదు.**

**ఏజెన్సీ ప్రాంతంలో ప్రొటెక్షను ఆర్డర్లను రెవెన్యూవారు ఇవ్వడమే ఏజెన్సీ చట్టాల ప్రకారం చట్ట విరుద్ధం. రెవెన్యూ వారు ఇస్తున్న చట్ట విరుద్ధ ప్రొటెక్షన్ ఆర్డర్ల పేరుతో పోలీసు వారి జోక్యంకూడా చట్ట విరుద్ధమే. పోలీసువారి అండతోనే గిరిజనేతర భూస్వాములు బరితెగించి వ్యవహరిస్తున్నారు. గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతోంది.**

తమరు ఈ విషయాలను పరిశీలించి గిరిజనులకు న్యాయం జరిగేలా, చట్టాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. గతంలో 200 కేసులు ఎత్తివేశారంటే భూస్వాములు, పోలీసులు కలిసి ఏ విధంగా అక్రమకేసులు పెట్టి, గిరిజనులను హింసిస్తున్నారో పరిశీలించగలరు.

అమాయక గిరిజనులపట్ల దయతో కాకుండా వివక్షా పూరితంగా, అనుచితంగా వ్యవహరిస్తున్న పశ్చిమ ఏజెన్సీ ప్రాంతపు పోలీసువారి చర్యలు అరికట్టాలని కోరుతున్నాము. చట్ట విరుద్దంగా భూవివాదాల్లో జోక్యం చేసుకోకుండా తగు ఆదేశాలిమ్మని విజ్ఞప్తి చేస్తున్నాము. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు, నేతలపై అక్రమంగా రౌడీషీట్లు ఎత్తివేయాలని తక్షణం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులపై పోలీసు నిర్భంధాన్ని అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

***అభివందనములతో...***

| | | |
|---|---|---|
| **(డా॥ యం.బాబూరావు)** | **(వై.వెంకటేశ్వరరావు)** | **(పెనుమల్లి మధు)** |
| మాజీ పార్లమెంటు సభ్యులు | రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు | రాష్ట్ర కార్యదర్శి |